# కాకీదుస్తులవెనక

## మంత్రవాది మహేశ్వర్

తండ్రి చిన్నప్పుడే పోవడంతో తల్లిరెక్కల కష్టం మీద కాళిదాసు మెట్రిక్యులేషన్ కంటే చదవలేకపోయాడు.

అదే చాలనుకున్నాడు.

అందుకే క్వాలిఫికేషను మెట్రిక్యులేషనే అయింది.

'అది చేతిలో పెట్టుకుని తిరిగితే లాభం లేదు. అది ప్రక్కన పెట్టి ఏ సూటు మనిషి బూటు కాళ్ళయినా పట్టుకోవాలి. అదీ ఓ రెండుసార్లు అతను విదిలించినా నువ్వు వదలకూడదు' అన్నారు కొందరు — కావల్సినవాళ్ళు.

'ఛీఛీ కుదరదు... నా వల్ల కాదు. కష్టపడి పనిచేయడానికి సిద్ధంగా వున్నాను. దానికి కాళ్ళు పట్టుకోవడం దేనికి' — ఆ పట్టుదల మరో రెండేళ్ళు నిరుద్యోగిగా వుండమని శపించింది.

తల్లి అనారోగ్యం...

అక్కయ్యకి నిశ్చయమవుతుందనుకున్న పెళ్ళిని కట్నం వెనక్కి త్రిప్పడం... పరిస్థితులు మళ్ళి రంగులు మార్చాయి.

"ఓ అయిదువేలున్నాయా... యిలా పట్టా. బంగారంలాంటి క్లర్క్ పోస్ట్ వేయిస్తా" అన్నాడో శ్రేయోభిలాషి.

"అయిదువేలే వుంటే ఈ పాటికి ఉద్యోగం గురించి అంత తల బద్దలు చేసుకోవడం దేనికి" కాళిదాసన్నాడు.

మరో రెండేళ్ళు కదిలాయి.

తల్లి అనారోగ్యం బాగుపడింది.

కానీ

అక్కయ్య—

అక్కయ్య—

పెళ్ళి పెటాకులు లేకుండా ఎన్నాళ్ళుండగలుగుతుంది...

వయసొచ్చింది ఎవడితోనో లేచిపోయి వుంటుంది — ఇవి నలుగురూ గొంతు కలిపి అన్నమాటలు.

కాళిదాసు గుండెకు తాకాయి...

అమ్మకి గుచ్చుకున్నాయి...

తనకి తెలుసు

తన తల్లికీ తెలుసు...

'అక్క సీత అలాంటి పని చేయదు. పరిస్థితులు అర్థం చేసుకుని జీవితం అర్థంకాక ఎటో వెళ్ళిపోయింది'

ఎటు—

ఏమో—

వస్తుందా—

తెలియదు—...

ఏళ్ళు గడుస్తున్నాయి కాని ఎంప్లాయిమెంటాఫీసు నుండి ఏ పిలుపూ లేదు.

ఇన్నాళ్ళు పడుతుందా

తనని మంచి మార్కులేనే!

ఆ అనుకున్న మాటే ఎవరి దగ్గరో అంటే అరగంట నవ్వాడు వాడు. 'పిచ్చివాడా ఓ రెండొందలు పట్రా. వారంలో ఓ కాల్ వేయిస్తా' అన్నాడు.

"ఎలా" అనడిగాడు.

"అదంతా నీకెందుకు యిస్తే చాలు"

ఆ రెండొందలన్న మాట రెండు లక్షలన్నట్లుగా వినిపించింది కాళిదాసుకి.

ఏ పూట తిండి ఆ రోజు వెతుక్కోవలసి వస్తోంది. అటువంటిది రెండువందలా... ఎలా... ఎక్కడ్నుంచి?

గ్రాడ్యుయేట్లు, పోస్ట్‌గ్రాడ్యుయేట్లు చిన్న చిన్న ఉద్యోగాలకే పోటీ పడుతున్నారు. అటువంటిది తననెవరు లెక్క చేస్తారు.

తనకి తెలివితేటల్లేక కాదు.

ఆర్థికస్తోమత లేక.

—అదిలేకనే తన చదువు అక్కడితో ఆగింది. లేకపోతే, అందరిలా తను మరో రెండు డిగ్రీలు తగిలించుకునే వాడు.

'కాలం' నీకోసం నేనాగనంది.

'పరిస్థితులు' — నా దారి నావన్నాయి.

రోజూ కూలి మీద తల్లితో బాటు తన అర్థాకలిని కూడా తీర్చుకోగలిగాడు.

'ఇంటికి పెద్దకొడుకు పేరు నిలబడతాడు' — ఎవరో అన్నారో, ఎక్కడో చదివాడో...

తను ఆ యింటికి ఒక్కడే కొడుకు.

పె... ద్ద... కొడుకు.

* * *

కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌కి సెలక్షన్స్ అని తెలిసింది.

తనకీ పిలుపొచ్చింది.

ఆనందం...

సెలక్టవుతానా... మంచిబట్టలేవీ. అందరూ మంచిబట్టలేసుకుని వస్తారు. తను యిలా వెడితే, ఛీఛీ అనుకోరు... కానీ ఏం చేయాలి?

పరమేశాన్ని ఓ రోజుకోసం అడిగితే?

పరమేశం తనకి చిన్నప్పట్నుంచీ ఫ్రెండు.

కాదనడు.

కానీ బావుంటుందా—?

ఏ మూలో వున్న, ఎందుకూ పనికిరాని అభిమానం... పిచ్చి అభిమానం.

అది పేదవాడికి పనికిరాదు.

దాన్నసలు ఎదగనివ్వకూడదు.

చంపేయాలి... నరికేయాలి.

తెగిపోయిన చెప్పుకి పిన్నుపెట్టుకుని వేసుకుని వెళ్ళబోతుండగా పోస్ట్‌మాన్ వీరయ్య ఎదురొచ్చాడు నవ్వుతూ...

'ఫలానా వాళ్ళు ఎదురొస్తే, యిలా అవుతుంది, అలా అవుతుంది వాళ్ళయితేనే మంచిది. వీళ్ళయితే పాపం' ఇలాంటి శకునాల మీద నమ్మకం లేదు తనకి. ఎందుకంటే ఆ వయసులోనే 'జీవితం' తెలిసిపోయింది కనుక.

వచ్చిన వీరయ్య నవ్వాడు.

నవ్విన వీరయ్యను పలకరించాడు. 'బావున్నావా ఏమిటిలా వచ్చావు' అని

"మీకు రెండొందల రూపాయల మనియార్డరొచ్చింది" అన్నాడు.

"ఏమిటి నాకా" నవ్వాడు.

ఆ నవ్వుతో నాకేమిటి, ఆ మనియార్డరేమిటి అన్న సందేహాలున్నాయి.

"సరిగ్గా చూడు" అన్నాడు కూడా.

"అవును బాబు మీకే — టు కాళిదాసు... అడ్రసు కూడా చదువుతూ" ఈ ప్యాకెట్ కూడా మీదే"

కాళిదాసు అనుమానం బలపడింది.

'ఎక్కడ్నుంచి—' ఫారమ్ త్రిప్పి చూశాడు.

తమ్ముడూ,

బావున్నావా? అమ్మ ఎలా వుంది? నేనింకా మీకు గుర్తుంటే అదృష్టవంతురాల్నే. ఎక్కడుంటున్నావు... ఏం చేస్తున్నావు అని అడగకు. బ్రతకటానికి ఓ దారి చూసుకున్నాను... నాకు చేతనైనంత సహాయం చేస్తాను.

బాగున్నావా. అమ్మ ఎలావుంది. నేనింకా మీకు గుర్తుంటే అదృష్టవంతురాల్నే. ఎక్కడుంటున్నావు... ఏం చేస్తున్నావు అని అడగకు. బ్రతకటానికి ఓ దారి చూసుకున్నాను... నాకు చేతనైనంత సహాయం చేస్తాను. ఈ సారికి రెండొందలు పంపుతున్నాను. నీ కోసమని కుట్టించిన బట్టలున్న ప్యాకెట్ కూడా అందే వుంటుంది.

ఇట్లు
సీత

...అంతే. అడ్రసేమీ లేదు.

పోస్టల్ స్టాంపు చూశాడు. హైదరాబాదు నుంచి అని తెలిసింది.

కళ్ళలోంచి నీటి బిందువులు రాలిపడ్డాయి.

బ్రతుక్కి దారి చూసుకున్నాను

ఏం చేస్తున్నట్టు...?

దానిక్కారణం తన అసమర్థతా?

తమ పేదరికమా?

ఇవి కాళిదాసు మెదడులో మెదిలిన ప్రశ్నలు.

జవాబులు దొరక్క కాసేపు గోల చేశాయి.

కానీ—

ఆడదాన్ని ఆదరణతో చూడకపోయినా, ఆనందం కోసం వాడుకునే వాళ్ళ సంఖ్య 'దేశం'లో బానే వుంది.

'పుట్టినందుకే బ్రతకటం' అనుకునే రోజు వచ్చినప్పుడు, ఆకలి తీర్చుకోవటానికి మార్గం కనబడనప్పుడు 'శరీరాన్ని అమ్ముకుంటే తప్పేముంది' అనిపిస్తుందేమో...

అది తప్పని తెలుసు సీతకి.

కానీ,

డబ్బు కోసం తనీనాడు ఆ పని చేస్తోంది... చేయాల్సివస్తోంది.

డబ్బుండి, లక్షణమైన పెళ్ళాముండి అన్నీవుండి తన



దగ్గరికి ఎంతమంది రావటం లేదు—

మనస్ఫూర్తిగా ఏడడుగులు నడిచి, మూడుముళ్ళూ వేసి, అర్థంకాని మంత్రాలను నోరు తిరక్కపోయినా ఉచ్చరించి 'నా దానివని' ఓ చోట ప్రమాణాలు చేసొచ్చి తన అందాన్ని ఎందరు పొగడడం లేదు—?

తన వయసు కూతుళ్ళున్న వాళ్ళెందరు తన దగ్గరికి రెగ్యులర్‌గా రావటం లేదు—

ప్రేమాభిమానాలకి నీళ్ళొదిలేసి డబ్బిచ్చి తన సుఖాన్ని ఎందరు కొనుక్కోవటం లేదు—

కానీ చిత్రమేమిటంటే,

వాళ్ళని ఎవ్వరూ ఏమీ అనరు.

వాళ్ళకి సమాజంలో ఓ స్థానం వుంది... గౌరవం వుంది... వాళ్ళు చేసే పాపల్ని కడుక్కోవటానికి వాళ్ళదగ్గర కావల్సినంత డబ్బుంది... రేప్పొద్దున్న వాళ్ళు ఛస్తే ఏడవటానికి, మోయటానికి, ఆస్తిపాస్తుల్ని పంచుకోవటానికి మనుషులుంటారు.

కానీ,

తన బ్రతుక్కి—

రాగానే లైటు తీసేసే వాళ్ళేగానీ చీకట్లో ఆ కళ్ళల్లో నీరు చూశారా?

ఏ ఒక్కరైనా గతమడిగారా—

ఓ రోజు ఓ పత్రికా విలేఖరి—

పత్రికలో ఎలాంటి ప్రశ్నలు, జవాబులుంటే జనం ఎగబడి చదువుతారో తెలిసిన తెలివైన విలేఖరి—

ఎన్నో ప్రశ్నలు వేశాడు.

మరెన్నో రకాలుగా ఫోటోలు తీశాడు.

చాలా పెద్ద మొత్తమే ముట్టజెప్పాడు – అంటే ఓ మూడు రాత్రుళ్ళు కళ్ళుమూసుకున్నంత—

ఆ డబ్బు తనని లొంగదీసుకుంది.

నిజానికి ఆ విలేఖరి కూడా తన చేదు జీవితం అడగలేదు. ఈ వృత్తిలో అనుభవాలడిగాడు. కొన్ని కొన్ని మార్చి వ్రాసుకోవడానికి అనుమతి అడిగాడు.

అన్నింటికీ 'ఊ' అన్నాక, అచ్చయ్యాక ఓ కాపీ పంపించాడు.

నిజాయితీ పరుడనిపించుకున్నాడు..

''అందంగానే వుంటావుగా సినిమాల్లోకెందుకు వెళ్ళకూడదు'' అనడిగారు సీతని రాత్రిళ్ళొచ్చేవాళ్లు.

దానికి తను జవాబివ్వలేదు...యివ్వలేదు.

''రేటు చెప్పకూడదూ పర్మనెంటుగా వుండిపోదువు గానీ'' అని అన్నవాళ్ళూ వున్నారు.

అవన్నీ వాళ్ళవేడి చల్లారక ముందు వినబడే మాటలు...

...అవి గుండె చేరేసరికి కళ్ళుమూసుకుంది, కన్నీరు బయటికి రానివ్వకుండా వుండేందుకు.

*   *   *

కాళిదాసు సెలక్టయ్యాడు

టెస్ట్ బాగా వ్రాసి, ఇంటర్వ్యూ బాగా చేశాడు కూడా.

చేస్తే రావాలని కాదు.

వచ్చింది... అదృష్టం కూడా బావుంది.

''అధికార్లలో అవినీతి లేకపోవడం నీకో మార్గం చూపించింది'' అన్నారు కొందరు.

నిజమే...

ఏది ఏమైనా కాళిదాసు జీవితానికో దారి దొరికింది.

ఇప్పుడిక తన కృషి మీద తన భవిష్యత్తు ఆధారపడి వుంది.

తల్లి ఎంతో సంతోషించింది.

కాని—

ఆ సంతోషాన్ని పంచుకోవడానికి సీతే లేదు.

*   *   *

కాలచక్రపు వేగంలో రోజులు నెలలై నెలలు ఏళ్ళయ్యాయి.

పరిస్థితుల్లో మళ్ళీ మార్పులు.

తల్లిపోయింది...

కాళిదాసుకి పెళ్ళయింది...

ముగ్గురు పిల్లలకి తండ్రి అయ్యాడు.

కొంత సర్వీసయింది... కొన్ని ట్రాన్స్‌ఫర్లయ్యాయి.

కొన్నిచోట్ల పనిచేయబుద్ధి కాలేదు.

కారణం — మొదట్నుంచీ తను వ్యతిరేకించే, అవినీతి... తప్పుకి శిక్షపడితీరాలి.

ప్రభుత్వోద్యోగిగా, ప్రజల మనిషిగా తప్పుచేసిన వాడ్ని ప్రభుత్వానికి అప్పజెప్పే బాధ్యత తమది. అయితే అంతా అలా అనుకుంటున్నారా... 'లేదు'.

తప్పుచేస్తే లంచం యివ్వాలి.

లంచం యిస్తే తప్పు కప్పేయచ్చు... తప్పించేసుకోవచ్చు.

తప్పులు మళ్ళీ చేసేసుకోవచ్చు.

మళ్ళీ ఎప్పుడైనా దొరికిపోతే కాస్త ముట్టజెప్పాలి.

వీటన్నింటికీ తను వ్యతిరేకత వ్యక్తం చేయడంతో ఉద్యోగం తీసేసేంత అధికారం కొన్ని చేతుల్లో లేకపోవడంతో ట్రాన్స్‌ఫర్లు జరిగాయి. 50

''మనకొచ్చే జీతాలు సరిపోవు. చేసేది ప్రాణాలతో చెలగాటం. ఓ పెద్దనేరం చేసిన వాడ్ని ప్రాణానికి తెగించి పట్టుకుంటే మనకొచ్చేదేమిటి... మహా అయితే, అదీ ఎస్.ఐ. మనకు ఫేవర్ అయితే ఓ ఇంక్రిమెంట్ అదే ఎస్.ఐని వాడే ఎప్రోచ్ అయితే, బల్లక్రింద చేయి చాస్తే...'' అన్నాడోసారి కాళిదాసుతో అతని కొలీగ్.

కానీ ఏమైనా దానిని తను సమర్థించదు.

''ఓ నేరస్తుడ్ని పట్టుకుని వదిలేస్తే వాడిచ్చేదాంతో మనకో నెల గడుస్తుందేమో గానీ నేరస్తుడు బయటికొస్తే ఎంతమంది ప్రజలకిబ్బంది... మళ్ళీ ఎన్ని నేరాలు జరుగుతాయి. డబ్బుకి కక్కుర్తి పడటం నేరాలను చేతులారా ఎక్కువచేస్తున్నట్లే అవుతుంది. జీతం సరిపోకపోవటం అనేది వేరే సంగతి. ఎవరికి వాళ్ళు వున్నదాంతో తృప్తి పడకుండా ఆశలకి పోవడం నాకు గిట్టదు'' అన్నాడు కాళిదాసు.

నీ ఖర్మ అని వదిలేశారు కొందరు.

బాగుపడే సూచనలు లేవని కొందరంటే — 'ఈ కాలంలో వుండాల్సిన వాడు కాదు' అని మరికొందరన్నారు.

చివరికి పెళ్ళాం కూడా అతని నిజాయితీని తిట్టిపోసింది.

తను పట్టించుకోలేదు.

కానీ,

అదృష్టం కొద్దీ తన నిజాయితికి గుర్తింపు వుండే స్టేషన్లో పడ్డాడు. కొత్తగా వచ్చిన ఎస్.ఐ కూడ మంచి ఆదర్శాలున్న వ్యక్తే.

కాళిదాసుపైన గుడ్ రిపోర్ట్స్ వెళ్ళాయి పై అధికార్లకి.

కాళిదాసు నిజాయితీ కూడా తలెత్తుకుని నిలబడింది.

అందుకు గుర్తింపుగా ప్రభుత్వం ప్రమోషనిచ్చింది.

ప్రమోషనొచ్చినా అతని మనసు అదోలా వుంది...

'తన ఉన్నతిని చూసి గర్వించడానికి తల్లిలేక పోయిందే' — అని కాదు.

'ప్రమోషన్ కారణంగా పిల్లల చదువులు పాడవుతాయనీ — కాదు'

'ఎన్నో ఏళ్ళ తరువాత తనకీ గుర్తింపు లభించిందనీ కాదు'

మరి—

ఉదయం చేసిన రైడ్‌లో ఓ వేశ్యాగృహంలో సీతను చూసినందుకు.

ఆ సమయంలో మనసు చివుక్కుమన్నా — సీతా గుర్తుపట్టినా పట్టనట్లు నటించినందుకు.

—అలా నటించి తన తోటివారి ముందు తన పరువు కాపాడినందుకు...

అలా పరువుకాపాడిన సీతను కర్తవ్య నిర్వహణలో' తొబుట్టువనే తేడాను మరచిపోయినందుకు.

కాని సీత నవ్విన ఆ చిన్న పొడి నవ్వులో

చూడలేక చూసిన ఆ కళ్ళలో

''నే చేసిన పాపం నాది — నీ కర్తవ్యం నువ్వు చేస్తున్నావు'' అన్న బాధ వుంది. అందులో గర్వమూ వుంది.

—అయితే కాళిదాసు స్థాయిలోనే వున్న ఓ కాకీ దుస్తుల వ్యక్తి కారణంగానే తనీనాడు ఇలా నిలబడాల్సి వచ్చిందని, ఆ నాడు తను పెట్టిన కేకలు ఆ పోలీస్ స్టేషన్ దాటి ఎవరికి వినిపించినా తనకా పరిస్థితి వుండేది కాదని సీత ఎవరికి చెప్పాలి... ఎలా చెప్పాలి... చెప్పి ఏమిటి ప్రయోజనం? *

